# గౌరవనీయుడు

పగలు ఊరంతా తిరిగి వస్తూవుంటాడు. రాత్రి ఓ ప్రొద్దు పోయేదాకా నిద్రపోడు. ఒకటేఆలోచనలు! చెయ్యటానికి పనంటూ ఏమీ లేదు. తానొక పెద్దమనిషని, సంఘంలో తనకున్న ప్రత్యేక స్థానాన్ని కాపాడుకోవాలని తాపత్రయం. తానెవరు,తనకున్నమర్యాదేమిటి అని ప్రశ్నిస్తే అతనికే సమాధానం. తెలియదు. సంసారాన్ని గుట్టుగా కాపాడుకోవాలి. తనవిషయం గాని తన కుటుంబ విషయంగాని, ఎవరికి తెలియకూడదు. ఎవరూ చర్చించ కూడదు. అర్థంలేని ఆలోచనలు వీటితో సరిగా నిద్రపట్టదు. నిద్ర పట్టిందంటే చప్పున మెళకువరాదు.

ఒళ్ళంతా బద్ధకంగావుంది. పక్క మీద మసులుతున్నాడు. లేవ బుద్ధి పుట్టటంలేదు. అయినా నిద్రలేచి ఏం చేస్తాడు. బారెడు పొద్దెక్కితే మాత్రంయేం! ఏదైనామించిపోతోంది కనకనా! పగలల్లా ఏదో విధంగా కాలక్షేపం చేయాలిసిందే. అందుకని తొందరపడి

లేచి బైటకు రావటం యెందుకు! అందుకనే ఆ ప్రక్కలోనే పడుకున్నాడు ముసుగు పెట్టి. ఈ పని యివ్వాళ మొదలు పెట్టింది కాదుగా, నెలల తరబడి చేస్తున్నదే! ఆ యింట్లోవాళ్ళకు ఇది కొత్తగాదు. ఒక్కసారి తన గది కిటికీలోంచి బైటకు చూశాడు. సూర్యకిరణం సూటిగావచ్చి కంట్లోగుచ్చుకుంది. కళ్ళు నలుపుతూ మళ్ళీ పడుకున్నాడు. అతని భార్య గుమ్మంలో కూర్చుంది. ఆమె పెందరాళే నిద్రలేస్తుంది అసలు నిద్ర పట్టదు, నిద్రపోదు. ఆకలికి నిద్రకు బద్ధవైరం, రెండూ ఒకచోట వుండలేవు ఆమెను ఎప్పుడూ ఆకలి కౌగలించుకుని వుండేది. తెలతెల వారుతూ వుండగానే పక్కచుట్టేసి, ఉట్టే పనులన్నీ పూర్తి చేసుకుంటుంది. పనులేమున్నాయి కనక, వాకిలి గుమ్మం చిమ్మేసి, యిన్ని నీళ్ళు చిలకరించి, ముగ్గేస్తుంది! అంతే! తర్వాత అంతా తీరుబడే ఆమెకు పనులేమీలేవు; ప్రత్యేకంగా యీ పని చెయ్యాలంటూ అసలు లేనేలేదు.

ఎంత సేపని పడుకుంటాడు కనక! నిద్రమత్తు వదలించుకుని బైట పడ్డాడు. భార్య గదిగుమ్మానికి ఆనుకుని కూర్చుంది. ఆమెను చూశాడు పలకరించలేదు పలకరించటానికి యేముంది! రోజూ ఆమె చేసే పనే! ఎందుకు అట్లా కూచున్నావని అడగటం అనవసరం. అతనికి తెలుసు, అందరికీ తెలుసు. ఏమీ చేసేది లేక అట్లా కూర్చుంది అంతే! పక్షులు గూళ్ళలోంచి కిచకిచమంటూ తెల తెల వారుతూ వుండగానే, బైటకువచ్చేస్తూ వుంటాయి. ఎటో ఎగిరిపోతూవుంటాయి. మళ్ళీ సాయంత్రం వేళ్ళకు గూళ్ళకు చేరుకుంటాయి. ఆయన పిల్లలు అంతే! తెల్ల వారంగానే, పిల్లలు నలుగురూ ఎటెటో వెళ్ళిపోతారు! ఎక్కడికి వెళ్ళుతున్నారు,! ఏం చేస్తున్నారు

అని అడిగే ధైర్యం అతనికి లేదు. ఆమెకూ లేదు. వాళ్ళ మొహాలు చూసి ఆమె ఒక్కొక్కప్పుడు విచారపడుతుంది. ఒక్కొక్కప్పుడు సంతోషపడు తుంది అంతే!

అతను ఆనాడు పొద్దున్నుంచి ఆరాటపడుతున్నాడు. భార్య మీద బాగా కోపంగా వున్నాడు. ఆమె గమనించలేదు. రోజూ మాదిరే అనుకుంది గభాలున ఆమెకు దగ్గరగా వెళ్ళి కూర్చున్నాడు.

"మళ్ళీ ఆ షావుకారిని అప్పు అడిగావట నిజమేనా!.... నేను యెన్ని సార్లు చెప్పాను, అతని దగ్గరకు వెళ్లొద్దని" గంభీరంగా అన్నాడు.

ఆమె మెదలకుండా వూరుకుంది. రెట్టించి అడుగుతుంటే తప్పనిసరయి— జవాబు చెప్పటం.

"వెళ్ళక తప్పింది కాదు ఆనాడు" ఆమె ఏదోచెప్పబోతుంటే, అతను చిర్రుమన్నాడు.

"అపుడు ఆనాడు, ఆ షావుకారు సరుకులు యివ్వకపోతే మనం, మన పిల్లలు మాడిచచ్చేవాళ్ళం అంటావు అంతేగా? — నీ కేవిధంగా చెప్పాలో నాకర్థం కావటంలా— మన బీదరికాన్ని, మన అసమర్థతను యితరులు యెగతాళిచేస్తారు, ఎవ్వరికీ తెలియ నీయకూడదు' ఆ షావుకారు యేమన్నాడో తెలుసా? నేనుట వాళ్ళ లెక్కలు చూసిపెట్టాలిట, నెలకు యింతని యేర్పాటు చేసుకోవచ్చు అన్నాడు. ఇంత చులకనా? మనకు డబ్బులేదనేగా వాడివుద్దేశం, డబ్బు లేకపోవచ్చు, ఆత్మ గౌరవం వుంది, దాన్ని అమ్ముకోలేము. ఇంతమాట నన్ను ఎందుకు అనగలిగాడు? నువ్వు చీటికీ మాటికీ ఆ షావుకారు దగ్గరకు అప్పుకోసం వెళ్ళటం వలనే, మనం తేలికయి

పోయినాం. ఇంకా మన గౌరవ మర్యాద లెక్కడివి! వంశ గౌరవం మంట కలిసిపోయింది. ఇలాంటి పనులు యింకెప్పుడు చెయ్యకు. జాగ్రత్త! "ఉద్రేకంగానూ, ఆవేశంగాను అన్నాడు.

ఆమె పెద్ద పెట్టున ఏడ్చింది. దానికి కారణం ఫలానా అని చెప్పటానికి వీల్లేదు. కేవలం భర్త అన్న మాటలకే ఆమె కుమిలిపోతుందంటానికి పూర్తిగా అవకాశం లేదు. ఆమె రెండు రోజులబట్టీ ఉపవాసాలు చేస్తోంది. ఆయన సూటిపోటి మాటలతో ఆమె తన దుఃఖాన్ని ఆపుకో లేక పోయింది. ఉద్వేగాన్ని భరించ లేకపోయింది. ఆమె చేయకలిగింది చేసింది. ఆమె పెద్ద పెట్టున ఏడ్చింది. ఆయన లోపల బాధపడ్డాడు. పైకి మాత్రం బింకంగానే వుండిపోయాడు.

అమాంతం గదిలోకి వెళ్ళి, కావిడి పెట్టెలో భద్రంగా దాచిన ఉన్ని కోటునుతీశాడు, వేసుకున్నాడు,అద్దంముందు నిలబడ్డాడు. ఆ కోటులో ఆయన ఠీవియింకా గంభీరంగా కనిపించింది. ఆ కోటును చీటికి మాటికి తీసే అలవాటులేదు. తనపుట్టిన రోజునాడు తొడుక్కునే వాడు తర్వాత అప్పుడప్పుడు ఇంటర్వ్యూలకోసం, ఆ కోటును సరిదిద్దుతూవుండేవాడు. ఆనాడు ఆయన పుట్టిన రోజుకాదని ఆమెకు తెలుసు. ఇక ఏదో ఉద్యోగానికి బయలుదేరటమే అని ఆమె ఖాయం చేసుకుంది. ఆ క్షణాన ఆమె మనస్సు ఉప్పొంగింది. ఆకలినిమరచే పోయింది. ఈసారైనా ఉద్యోగం తప్పక వస్తుందని ఆమెఉత్సాహపడింది. కాని ఆ ఆనందాన్ని ఉత్సాహాన్ని ఆయనకు కనపరచలేదు వెళుతున్న భర్తవైపు ఆశగా చూస్తూ నిలబడింది. ఆయన సరాసరి వెళ్ళాడు. అమాం బాపతు వస్తువులు అమ్మే బజారుకు వెళ్ళాడు. అలాంటి బజార్లు ప్రతి పట్టణంలో వుంటూనే

వుంటాయి. ఒక్కొక్కచోట ఒక్కొక్క పేరుతో ఆ బజారు ప్రసిద్ధిగా తెలుస్తుంది. ఆ ఊళ్ళో ఆ బజారు పేరు మాయాబజార్. అటూ యిటూ చూశాడు. ఎవరూ పరిచయస్థులు కనబడలేదు ధైర్యంచేసి అడుగుదామనుకుంటున్నాడు. "బాబుగారు మీకేంకావాలి," ఎవరిదో ప్రశ్న. ఉలిక్కిపడ్డాడు. నాకేమీ అక్కర్లేదు అని మనస్సులో అనుకున్నాడు. కోటును మెల్లిగా విప్పాడు. ఆ షాపు యజమానికి చూపించాడు. ఇది అమ్ముతాను కొంటారా అనగలిగాడు "ఇది ఉలెన్ కోటు ఇప్పుడు ఫేషన్ కాదు. అంతా 'టెర్లిన్, నైలాన్' మయమైపోయింది. ఇదక్కర్లేదు" అన్నాడు ఆయన విస్తుపోయాడు. ఈ కోటు తన గౌరవానికి, హుందాకి గుర్తు, వంశ మర్యాదకు చిహ్నం. తనతండ్రిగారు పెద్ద హోదాలోవున్న రోజుల్లో తొడుక్కున్న కోటు. తన కొచ్చిన ఆస్తిఅంతా అయిపోయింది. ఈ ఒక్క కోటే మిగిలింది. దాన్ని నిలబెట్టుకోవటానికి యిన్నాళ్ళబట్టీ ప్రయత్నం చేశాడు. కాని ఈ రోజు దాన్నికూడా అమ్మటానికి సిద్ధమయ్యాడు. కాని అమ్ముడుపోలేదు. తన పాత ప్రాభవాన్ని కూడ డబ్బు చేసుకోలేక పోయాడు. ఆయన మనస్సు కలవరపడి పోయింది. ఈ సంఘటన చాల చిత్రంగా తోచింది ఈ కోటును అమ్మేయ్యొచ్చని, ఆ డబ్బుతో కొన్ని రోజులు గడిపేయవచ్చని ఎంతో ఆశించాడు. ఆ ఆశ విఫలమయింది అయితే ఆయనకు తృప్తే మిగిలింది, అదే ఆ కోటు మిగిలిందని!.

సరా సరి యింటికి వెళ్లాడు, ధీమాగా, దర్జాగా లోపలికి వెళ్లాడు. తన వంశ గౌరవాన్ని నిలబెట్టుకోగలిగానన్న గర్వంతో మరీ వెళ్ళాడు. భార్య మొహంయింతచేసుకుని 'ఏమయిందండీ ఇస్తారా' అన్నది. ఆయనకు తెలుసు, భార్య అడిగిన ప్రశ్న

ఆయనకు తెలుసు, ఆమెను చూస్తుంటే ఆయన మనస్సు ద్రవించింది. ఆమె కళ్ళల్లో ఉట్టిపడుతున్న ఆప్యాయత, ప్రేమలను, ఆయన్ను యింకో మనిషిని చేసినాయి. ఆమెకు నిజం చెప్పి, మనస్సు కష్టపెట్టటం యిష్టం లేక పోయింది. అబద్ధం ఆడాడు. 'అవును ఉద్యోగం వచ్చేటట్టేవుంది. ఒక వారం రోజుల్లో తెలుస్తుంది' అన్నాడుముక్తసరిగా. ఆమె కళ్ళు మూసుకుని, రెండు చేతులతో నమస్కారం పెట్టింది మనస్సులో భగవంతుని ప్రార్థించుకుంది. ఈనాటికైనా తమ మీద దయ కలిగినందుకు భగవంతున్ని ఎన్నోవిధాల పొగడింది ఆయన అంతా గమనిస్తూ వూరుకున్నాడు

కాని ఆయన మనస్సంతా గజి బిజిగా వుంది. ఎంతగా నిబ్బరంగా వుందామన్నా, పరిస్థితులు అతన్ని తీవ్రంగా కలవర పెడుతున్నాయి. అమాంతం వీధి తలుపు చప్పుడయింది. ఆయన కళ్ళు అటువైపు తిరిగినాయి. గుండె గుభేలుమంది. తలుపు దగ్గరున్న వ్యక్తి ఆయన చిన్ననాటి స్నేహితుడు. ఈ మధ్యనే యిద్దరూ కలుసుకున్నారు. మంచి చెడ్డలు మాట్లాడుకున్నారు. ఆయన స్నేహితున్ని తనింటికి రమ్మనమని ఆహ్వానించాడు. ఈ అహ్వానం, మాట వరసకు అన్నది కాని నిజంగానే ఆ స్నేహితుడు వచ్చేశాడు. ఇంత తరలో వస్తాడనుకోలేదు. ఆ స్నేహితునికి ఆయన తన విషయం ఎంతగానో చెప్పాడు కాని యీ రోజు యెట్లా మాట దక్కించుకోవటం! చాలా భయపడిపోయాడు. కృత్రిమంగా నవ్వు తెచ్చుకున్నాడు ఓపిక వున్నట్లు గభాలున లేచి నిలబడి.... 'ఎప్పుడు రావటం...' అంటూ స్నేహితునికి ఎదురుగా వెళ్ళి, లోపలికి తీసుకు వచ్చాడు. ఇద్దరూ మాట్లాడుకుంటున్నారేగాని, ఆయన మనస్సు

చాలా వ్యథపడుతోంది, వచ్చిన స్నేహితునికి యేవిధంగా మర్యాద చెయ్యాలా అని మథనపడుతున్నాడు. అవసరం అన్నిటికంటె బలమయినది. అవసరము ఏ పనినైనా చేయిస్తుంది. అలాంటి బలమైన అవసరం కలిగింది. ఆయన తొణకలేదు. స్నేహితున్ని స్నానానికి లెమ్మన్నాడు. గాలి, నీరు కావలసినంత! వాటిని డబ్బుతో కొనేపనిలేదు. స్నేహితుడు స్నానానికిలేచాడు, తన బుష్ షర్టును వంకెకు తగిలించి, వెంటనే తన రెండుకళ్ళు ఆబుష్షర్టుమీద కేంద్రీకరింపబడ్డాయి! తన భార్య, పిల్లలు వంటింట్లో వుండడం చూశాడు. అదే మంచి సమయుం అనుకున్నాడు. ఆ స్నేహితుని జేబులో కనబడుతున్న నోట్లలో రెంటిని గభాలున తీశాడు. ఇట్టే పెద్ద కొడుకును పిలిచాడు. కావలసిన సరకులను తెప్పించేశాడు. ఆమె ఉత్సాహంగా వంటచేసింది. అందరూ సంతృప్తిగా భోజనాలు చేశారు.

వచ్చిన స్నేహితుడు. తనకు కలిగిన ఆదరాభిమానాలకు, కృతజ్ఞత తెలియచేశాడు గండం గడిచింది. బ్రతికి బైటపడ్డాం అనుకొని తృప్తిపడ్డాడు. ఆయన స్నేహితుడు బుష్షర్టు తొడుక్కున్నాడు. ఆయనభయపడుతున్నాడు. గౌరవం, మర్యాదకాపాడుకున్నాం, కానియీక్షణంలోఏమవుతుందోననిగజగజలాడుతున్నాడు. ఆ స్నేహితుడు జేబుచూసుకున్నాడు. చప్పునఆశ్చర్యపడ్డాడు. కనపడని నోట్లు యెక్కడికి వెళ్లాయో! ఆకట్టాడు, పసికట్టాడు, అతను వచ్చినప్పటినుండి, యింట్లో వ్యవహారం. ఇంటి తీరు తెన్నులు పిల్లల బట్టలు, ఆమె దుస్థితి అంతా యిట్టే గ్రహించాడు. అయితే తాను తెలుసుకున్నట్టు మాత్రం ప్రవర్తించలేదు. అంతే ఆ స్నేహితుడు 'నమస్తే' అని శలవుతీసుకున్నాడు.

ఆయన సంతృప్తిగా నిట్టుర్చాడు. భార్యకు ఆశ్చర్యంగానే వుంది. పిల్లలు బిత్తరపోయారు. భార్య నిభాయించుకోలేక పోయింది 'డబ్బెక్కడిదండీ' అడిగింది భయపడుతూనే.

"నీ మాదిరి మన గౌరవమర్యాదలను బజార్లోకి యీడవను. నా వంశ గౌరవాన్ని నా హుందాతనాన్ని నేను నిలబెట్టుకో గలను...!" దర్జాగా అన్నాడు ఆయన.

అంటూ వుండగానే, ఆ స్నేహితుడు యిట్టే చక్కా వచ్చాడు లోపలికి. ఆయన ఆశ్చర్యపోయి చప్పున నిలబడ్డాడు నోటమాట లేదు. స్నేహితునివంక దిగాలుపడి చూస్తూ వుండిపోయాడు.

"నేను యీరాత్రికూడా యీ వూళ్ళోనే వుండవలసి వచ్చింది. యీ పూట కూడ మీ యింట్లోనే భోంచేస్తాను. ఖర్చుకుతీసుకో...." అంటూ ఆ స్నేహితుడు ఆయనకు రెండు నోట్లు తీసి అందిచ్చాడు.

ఆయన కళ్ళు గిర్రున తిరిగినాయి. గభాలున క్రింద పడిపోయాడు, ఆమె వచ్చి 'ఏమండీ' అంటూ బిగ్గరగా అరిచింది.

---